ముంపు బాధితుల గోడు వినరా?

- కొత్త బండరావిపాకులలోనూ బాధితులకు తప్పని ఇబ్బందులు
- సౌకర్యాలు మెరుగుపర్చాలని వినతి
- కొత్త ప్రభుత్వం అయినా సమస్యలు పరిష్కరించాలంటున్న బాధితులు


కొత్త బండరావిపాకుల గ్రామ వ్యూ (ఫైల్)

గోపాల్‌పేట: ఏదుల ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన బండరావిపాకుల గ్రామస్తులకు ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ వద్ద సైతం ఇబ్బందులు తప్పడం లేదు. కొత్త బండరావిపాకుల గ్రామంలో సుమారు ఏడాది క్రితం నుంచి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు సుమారు రెండు వందలకు పైగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా.. వాటిలో కొన్ని పూర్తయ్యాయి. అక్కడే నివాసం ఉంటున్న వారు సైతం ఉన్నారు. కానీ అధికారులు వారికి కనీస సౌకర్యాలు కూడా ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. గ్రామంలో కరెంటు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు సరిగా లేక కొత్తగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ముందుచూపుతో ఆలోచించకుండా తీసుకున్న నిర్ణయాల వల్లే చేసిన పనే మళ్లీ చేయాల్సి వస్తుందని, వర్షాలు కురిస్తే ఎక్కడికక్కడ నీరు నిలుస్తుండటంతో పారిశుద్ధ్యం లోపిస్తుంది. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

కొత్త బండరావిపాకులలో గ్రామస్తులకు తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేశారు. కానీ డ్రెయినేజీల కోసం కాల్వలు తీస్తున్న క్రమంలో భగీరథ పైప్‌లైన్లు ధ్వంసం అయ్యాయి. అవి మళ్లీ ఏర్పాటు చేయాల్సి ఉంది. కరెంటు స్తంభాలు ఏర్పాటు చేశారు. కానీ రోడ్ల మీద కాకుండా ఇళ్ల స్థలాల్లో కరెంటు స్తంభాలు పాతారు. దీంతో భవిష్యత్తులో ఇబ్బందులు అవుతాయని, ప్లాటు స్థలాల్లో ఉన్న స్తంభాలను రోడ్డుపై పాతాలని కోరుతున్నారు. ఎస్సీ, బీసీ, యూత్ కమిటీ హాళ్ల నిర్మాణం చేశారు. అంగన్‌వాడీ పాఠశాల పూర్తయింది. కానీ అందుబాటులోకి తీసుకురాలేదు. ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణం కోసం రెండు, మూడు సార్లు స్థలాన్ని పరిశీలించారు. కానీ ఇప్పటివరకు నిర్మించలేదు. గ్రామంలో సుమారు వేయి మంది వరకు అర్హులు ఉండగా కేవలం అందులో సగం మందికి మాత్రమే ప్లాట్లు కేటాయించారని, మిగతా వారికి కూడా స్థలాలు కూడా కేటాయిస్తే వారు సైతం ఇళ్లు నిర్మించుకుంటామని చెబుతున్నారు.

చదువులకు అంతరాయం



కొత్త బండరావిపాకులలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. అధికారులు చొరవ తీసుకుని కనీస సౌకర్యాలైన తాగు నీరు, రోడ్లు, డ్రెయినేజీ, కరెంటు ఏర్పాటు చేయించి పాఠశాలలు తొందరగా నిర్మించి ఇవ్వాలి. పిల్లలకు పాఠశాలలు లేక చదువులు అటకెక్కాయి. వర్షం వచ్చిందంటే మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుంది. గ్రామ అభివృద్ధి కోసం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– మిద్దెస్వామి, బండరావిపాకుల

సమస్యలు పరిష్కరిస్తాం

బండరావిపాలకులో తాగునీటి వసతి ఉంది. ఏదైనా సమస్యలు ఉంటే మాట్లాడుతాం. అలాగే ఇళ్ల నిర్మాణాలకు ఇప్పటికే స్థలం కేటాయించాం. తొందర్లోనే ఇళ్లు రావని వారికి వచ్చేలా చూస్తాం.

– లక్ష్మీదేవి, తహసీల్దార్, రేవల్లి

నిమోనియా లక్షణాలపై ఇంటింటి సర్వే



పాన్‌గల్: ఐదేళ్ల లోపు చిన్నారులకు నిమోనియా లక్షణాల గుర్తింపుపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని రేమద్దులలో ఇంటింటి సర్వే నిర్వహించినట్లు మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ లారెన్స్ తెలిపారు. జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉన్న చిన్నారులను చలి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ.. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. దీంతో పాటు చిన్నారులకు రోగ నిరోధక టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

మానసిక రోగులకు వైద్య పరీక్షలు

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్ అంబుజా ఆధ్వర్యంలో మానసిక రోగులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 27 మంది మానసిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

వరి నారు సంరక్షణపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు

కొత్తకోట రూరల్: మల్లారెడ్డి యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ విద్యార్థులు బుధవారం మండలంలోని వడ్డెవాటలో రైతులకు వరి నారు సంరక్షణ, నారు దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాచార బోర్డును రూపొందించి అవగాహన కల్పించారు. ఉదయం గ్రామానికి చేరుకున్న యూనివర్సిటీ విద్యార్థులు గ్రామంలోని రైతులను పోగుచేసి వరి పంట వేసిన తర్వాత సోకే పసుపు కాండం తొలుచు పురుగు, తెగుళ్ల పంట అన్ని దశలపై దాడి చేస్తాయని వివరించారు. ఈ దశలో నెక్‌బ్లాస్ట్, నోడ్ బ్లాస్ట్, లీఫ్‌బ్లాస్ట్ వంటి వ్యాధులు వస్తాయన్నారు. వరి పంట సమీపంలో గల కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ నందకిషోర్, రైతులు లక్ష్మీకాంతరెడ్డి, నర్సింహారెడ్డి, రవిందర్‌నాయుడు, నారాయణ, చంద్రశేఖర్, మన్యం ఉన్నారు.

సంత్ గాడ్గే బాబాకు ఘన నివాళి


కొత్తకోటలో సంత్ గాడ్గే బాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తకోట: సంత్ గాడ్గే బాబా 67వ వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ సంత్ గాడ్గే బాబా తన జీవిత కాలంలో విద్యా సంస్థలు, ఆశ్రమాలు స్థాపించడంతో పాటు పేద, దళిత, అట్టడుగు వర్గాలను అభ్యున్నతికి కృషి చేశారు. అజ్ఞానంలో కూరుకుపోయిన ప్రజలను మేల్కొల్పి సుఖ సంతోషాలకు మూలమైన భక్తి, సేవ మార్గాలను చూపించిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీసం చెన్నకేశవరెడ్డి, వెంకటేష్, బాలరాజు, భవాని రవి, మహేష్, అంజి, పేరూర్ బాలరాజు, శేషు తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో బుధవారం చీపురు దండు వ్యవస్థాపకుడు, సంఘ సంస్కర్త సంత్ గాడ్గే బాబా వర్ధంతిని నిర్వహించారు. నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజావాగ్గేయకారుడు రాజరామ్‌ప్రకాష్, పానుగంటి యేసేపు, కొమ్ము వెంకటస్వామి, పరమేశ్వరచారి, సత్యంచారి పాల్గొన్నారు.

చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్


శాగాపూర్‌లో బడిఈడు పిల్లల సర్వే చేస్తున్న సీఆర్పీలు


ఖానాపూర్‌లో ..


పాంరెడ్డిపల్లిలో..

అమరచింత: బడిఈడు పిల్లలందరూ బడిలో విద్యనభ్యసించాలని సీఆర్పీ స్వామి అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో బుధవారం బడి బయటి విద్యార్థుల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈమేరకు బడి మాని ఇంటి వద్దే పనులు చేసుకుంటున్న విద్యార్థుల కుటుంబాలకు విద్య యొక్క ప్రాధాన్యత గురించి వివరించారు. 14ఏళ్ల లోపు విద్యార్థులతో పనులు చేయిస్తే పోలీసు కేసు నమోదు చేస్తారని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందిస్తున్నారని తెలిపారు. క్రమం తప్పకుండా విద్యార్థులను బడికి పంపి వారి ఉన్నతికి తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. బడిమానిన ముగ్గురు విద్యార్థులను మళ్లీ బడిలో చేర్పించినట్లు సీఆర్పీ తెలిపారు.

ఆత్మకూర్: బడి మధ్యలో మానేసిన పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపాలని, తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆత్మకూర్ మండలంలోని గ్రామాల్లో బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

పాన్‌గల్: బడిఈడు కలిగిన పిల్లల ఇంటింటి సర్వే మండలంలో కొనసాగుతున్నది. సర్వేలో భాగంగా బుధవారం మండలంలోని శాగాపూర్‌లో బడి మానేసి ఇంటి పనులు చేస్తున్న విద్యార్థుల వివరాలను తెలుసుకొని వారి ఇళ్లకు వెళ్లి విద్య యొక్క ప్రాధాన్యత వివరించారు. విద్యార్థులను చదువు మాన్పించకుండా తప్పకుండా పాఠశాలలకు పంపించి ప్రభుత్వ బడుల బలోపేతానికి తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి పాల్గొన్నారు.

కరసేవకులను ఆహ్వానించాలి

ఖిల్లాఘనపురం: 2024 జనవరిలో నిర్వహించే అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి కరసేవకులను ఆహ్వానించాలని కరసేవకుల వనపర్తి జిల్లా ప్రముఖ్ కొక్కోళ్ల పట్టాభిరాములు కోరారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. 1992 డిసెంబర్ 6న విశ్వహిందు పరిషత్ పిలుపు మేరకు జరిగిన కరసేవలో పాల్గొనేందుకు తాము నవంబర్‌లోనే అయోధ్యకు చేరుకున్నామని తెలిపారు. రామ మందిరం నిర్మించేందుకు తాము ఎంతో తపించామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో రామ మందిర నిర్మాణం పూర్తి చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్న సందర్భంగా నాటి కరసేవకులకు ప్రత్యేకంగా పాసులు జారీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నాటి నుంచి నేటి వరకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న కరసేవకులను రాష్ట్ర ప్రభుత్వం అయోధ్యకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.

నేడు రక్తదాన శిబిరం

ఆత్మకూర్: తలసేమియా వ్యాధితో వందలాది మంది చిన్నారులు బాధపడుతున్నారని, రక్తదానం చేసి వారికి పునర్జన్మ ప్రసాదించాలని వివేకనంద సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మాస్టర్ బాలు కోరారు. ఈ నెల 22న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి ప్రారంభమయ్యే రక్తదాన శిబిరంలో యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేసి తలసేమియా వ్యాధిగ్రస్తులకు అండగా నిలవాలని కోరారు. వివరాలకు 98484 56391, 77801 79152 నంబర్లకు సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

'క్రాప్ హాలీ డే'కు సహకరించాలి

వీపనగండ్ల: ఉన్నతాధికారులు ఆదేశానుసారం జూరాల కాలువ కింద క్రాప్ హాలీ డే ను ప్రకటించామని, రైతులు యాసంగి సీజన్‌లో ఎలాంటి పంటలు సాగుచేయకుండా సహకరించాలని మండల వ్యవసాయాధికారి డాకేశ్వర్‌గౌడ్ రైతులకు విజ్ఞప్తి చేశారు. జూరాల డ్యాంలో పంటకు అవసరమైన నీరు లభ్యం కాకపోవడంతో ఇరిగేషన్ సబ్ డివిజన్ డీఈఈ భాస్కర్ ఆదేశానుసారం నీటిని విడుదల నిలిపివేశామని తెలిపారు. డ్యాంలో ఉన్న కొద్దిపాటి నీటిని మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి అవసరాల కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సరఫరా చేయాల్సి ఉందని, ఈ విషయాన్ని రైతులు అర్థం చేసుకోవాలని కోరారు.

'ఇబ్బందులకు గురిచేసిన వారిని సహించం'


మాట్లాడుతున్న ఆయూబ్‌ఖాన్

అమరచింత: బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఎన్నో రకాల ఇబ్బందులకు గురిచేసిన వారిని పార్టీలో చేర్చుకునే అవకాశం లేదని డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ తెలిపారు. మండలంలోని నందిమళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి తిరుగుతూ వారిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నారని, అలాంటి వారిని కాంగ్రెస్ పార్టీ సహించదన్నారు. చంద్రశేఖర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి చేయూతనిస్తూ అన్ని తామే అంటూ పల్లెలో పార్టీ జెండాలను భుజాన మోసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకే సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రతి నిరుపేద కుటుంబానికి అందించేందుకు ప్రణాళిక సిద్ధ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మాజీ సర్పంచ్ పురం వెంకటేశ్వర్‌రెడ్డి, వాటర్ వెంకట్‌రెడ్డి, రాజసింహారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మదనాపురం: మండలంలోని రామన్‌పాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రాములు ఇటీవల మృతిచెందారు. దీంతో బుధవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. రాములు కుటుంబానికి ఎల్లవేళలా ఆదుకుంటామని ఇందిరమ్మ ఇల్లు, భార్యకు పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. అవకావం ఉంటే కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న, నాయకులు వడ్డె కృష్ణ, శ్రీనివాసులు, రాములు, నాగ శేషన్న, చాపల శ్రీధర్‌రెడ్డి, అంజద్‌అలీ, ఖదీర్, ఎరుకల కాశన్న, రంగన్న, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ వితరణ

గ్రామానికి చెందిన చాపల బాలమ్మ, చాపల నారాయణరెడ్డి జ్ఞాపకార్థం వారి మనుమలు శ్రీధర్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి రూ.60 వేల విలువ చేసే ఫ్రీజర్ బాక్స్‌ను సర్పంచ్ కురుమూర్తి, పంచాయతీ కార్యదర్శి శిరీష చేతుల మీదుగా గ్రామస్తులకు అందజేశారు.

బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

అమరచింత: బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా సీఐటీయూ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తున్నామని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జి.శ్రీనివాసులు 25వ వర్ధంతి సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేస్తూ నిరంతరం కార్మికుల మధ్య ఉంటూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, రమేష్, అజయ్, శ్యాంసుందర్, బుచ్చన్న, రాఘవేంద్ర పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలతోనే పేదల అభ్యున్నతి


సూరాయపల్లిలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


నాగల్‌కడ్మూర్‌లో డ్రోన్ పనితీరుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందించడంతో పాటుగా పథకాలు పొందిన లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించి తగు చర్యలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ, కార్యక్రమ మండల కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని ఉప్పరిపల్లి, సూరాయపల్లి గ్రామాల్లో ఈ యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలతో కలిసి వీక్షించిన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఉపాధి పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనం, ఆరోగ్యం తదితర ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందన్నారు. ప్రజలంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోని లబ్ధి పొందుతున్నారని వికాసత్ భారత్ సంకల్ప యాత్ర కో ఆర్డినేటర్ శ్యాంసుందర్ అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జీవనోపాధి కలుగుతుందన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు సబ్సిడీలపై యంత్రాలు, వ్యాపారులకు బ్యాంకు ద్వారా రుణాలు, పోస్టాఫీస్‌ల ద్వారా ఆడపిల్లలకు సురక్ష యోజన పథకాన్ని అమలు పర్చిందన్నారు. బేటీ పడావో–బేటీ బచావో అన్న నినాదంతో బాలికల సంరక్షణకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కరోనా సమయంలో వాక్సిన్లను ప్రజలందరికీ ఉచితంగా అందించిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం వ్యవసాయ పొలంలో డ్రోన్ సహాయంతో మందులను ఎలా పిచికారీ చేయాలి అన్న విషయాలను రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామేశ్వరమ్మ, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరసింహులు, ఎపీఓ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ రఘు, ఏఈఓ హరిత, అధికారులు పాల్గొన్నారు.

సాహిత్య రంగంలో రికార్డు 'గానం'

పెబ్బేరు రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సాహిత్య రంగంలో కవితా గానంలో వనపర్తి జిల్లాకు చెందిన ఎండీ ఖాజామైనోద్దీన్ కవితా గానం చేసి రికార్డు సాధించారు. 30 గంటల రికార్డు నమోదు చేసుకున్నారు. బుధవారం అతడికి ప్రశంసా పత్రం పాటు జ్ఞాపిక, శాలువతో సన్మానించారు.



క్రిస్మస్ నిర్వహణ కమిటీ ఎన్నిక

కొల్లాపూర్ రూరల్: పట్టణ ఆర్టీఓ కార్యాలయంలో డీటీ హిమబిందు ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ నిర్వాహక కమిటీ ఎన్నుకున్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి పాస్టర్స్‌లు హాజరయ్యారు. కమిటీ అధ్యక్షుడిగా శాలెంరాజ్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి దాసు, కార్యవర్గ సభ్యులుగా అజయ్‌కుమార్, రాజు, సామేలు, కోళ్ల రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు జాన్సన్‌లు ఎన్నికయ్యారు. ఈ నెల 23న క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు అధ్యక్షుడు శాలెంరాజు తెలపారు.

నిలిచిన ధరణి సేవలు

కోడేరు: మండల కేంద్రంలోని విద్యుత్ కోతతో ధరణి సేవలు బుధవారం నిలిచిపోయాయి. రెండు రోజుల నుంచి విద్యుత్ కోత ఉండటంతో తహసీల్దార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'



మదనాపురం: కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటానని, అధైర్య పడొద్దని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కార్యకర్తలకు భరోసా కల్పించారు. బుధవారం మండలంలోని నెలివిడి, నర్సింగాపురం గ్రామాలతో పాటు తండాలో ఆ పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. రానున్న రోజుల్లో సమిష్టిగా పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్, సర్పంచ్ రాములమ్మ, ఎంపీటీసీ కురుమయ్య, నాయకులు రవీందర్ రెడ్డి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



ఆత్మకూర్: క్షణికావేషానికిలోనై వివిధ కేసుల్లో ఉన్నవారు ఈనెల 30వ తేదీన ఆత్మకూర్‌లోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహిస్తున్న లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. మండలంలోని గ్రామాలకు చెందిన కక్షిదారులు, క్రిమినల్, సివిల్, భూతగాదాలు, చిట్‌ఫండ్, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ కేసులు, కుటుంబ కలహాలు, వివిధ కేసుల్లో ఉన్న వారు రాజీ మార్గమే రాజమార్గముగా గుర్తించి రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. దీనివల్ల ఎంతో విలువైన సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందన్నారు. పూర్తి వివరాలకు కక్షిదారులు నేరుగా పోలీస్టేషన్‌లో లేదా ఫోన్ 87126 70631 నంబరును సంప్రదించాలని కోరారు.

వీపనగండ్ల విద్యార్థికి బంగారు పతకం



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన శశీంద్ర అనే విద్యార్థి ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–19 రెజ్లింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. మదుగని రాముడు, పెద్ద లక్ష్మి దంపతుల కుమారుడైన శశీంద్ర యాదాద్రి భువనగిరి జిల్లా టీఎస్‌ఆర్‌జేటీ గురుకుల పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 18వ తేదీ నుంచి రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని జియాగూడలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్న శశీంద్రను గోల్డ్ మెడల్ సాధించి, ఈ నెల 24 నుంచి జరగనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. మారుమూల గ్రామం నుంచి గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థికి పలువురు తమ అభినందనలు తెలిపారు.

పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ యాదవ్ బుధవారం వనపర్తి కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీకి కాంపౌండ్ వాల్ నిర్మించాలని, 108 అంబులెన్సును కేటాయిస్తూ, ఫర్నీచర్ ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఉన్నటువంటి హోమియోపతి సెంటర్‌ను మంజూరు చేయాలన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములు యాదవ్, నాయకులు కుమ్మరి గోవిందు, పసుల రాముడు,జె ఆశన్న పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



పాన్‌గల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనం, సామర్థ్యాలను పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించేలా హెచ్‌ఎంలు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణం విధి విధానాలు సవరించాలి



గోపాల్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో మార్పులు చేయాలని డీఎస్పీ మండల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలకు, కుటుంబాన్ని పోషించే మగవారికి ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారని, వారికి ప్రతినెలా రూ. మూడు వేలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ గోపాల్‌పేట మండల ఇన్‌చార్జి తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి రామానందతీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో కొల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఆసక్తి గల యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవాలని శిక్షకుడు భీమయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.